

పునరావృతం కాకుండా చూడాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం ప్రతి ఒక్కరినీ కదిలించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. వైద్య వృత్తిలో ఉన్న మహిళలకే రక్షణ కరువైతే మహిళల్లో అభద్రతాభావం పెరిగే ప్రమాదం ఉంది. మరొకరు ఇలాంటి చర్యలకు పాల్పడాలంటే భయపడేలా నిందితులకు శిక్ష అమలు చేయాలి.

– డాక్టర్ పి.కావ్య, యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి

మహిళా డాక్టర్లకు భద్రత అవసరం



మహిళా డాక్టర్లు రేయింబవళ్లు అత్యవసర కేసులకు హాజరు కావల్సి ఉంటుంది. కోల్‌కతా ఘటన వల్ల మహిళా డాక్టర్‌లు రాత్రి వేళల్లో విధులకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా వైద్యులకు తగిన భద్రత కల్పించడం ద్వారా వారిలో ధైర్యం పెంపొందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

– డాక్టర్ డి.జనార్దన్, యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి

కఠినంగా శిక్షించాలి



ప్రజల ప్రాణాలను రక్షించే వైద్యులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపై కూడా ఉంది. కోల్‌కతా ఉదంతం జరిగాక దేశమంతా స్పందించింది. మహిళలపై దారుణాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి. అప్పుడే మహిళలపై అఘాయిత్యాలు తగ్గుతాయి.

– ఇ.స్వర్ణలత, స్టాఫ్ నర్స్, యల్లాయపాళెం పీహెచ్‌సీ



క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి పురస్కారం



గిడుగు సాహితీ పురస్కారం అందుకున్న సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ గురువారం గిడుగు సాహితీసేవా పురస్కారం అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు టీడీ జనార్దన్, సినీ రచయిత బిక్కి కృష్ణ తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని సుధీర్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



విద్యార్థుల చేత చదివిస్తున్న డీఐ

పొదలకూరు: పిల్లలకు పాఠశాలల్లో విలువలతో కూడిన విద్యనందించాలని జిల్లా ఉర్దూ డీఐ షేక్ ఖాజామొహిద్దీన్ అన్నారు. పట్టణంలోని ఉర్దూ పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు కాలానుగుణంగా విద్యాబోధనలో మార్పులు చేసుకోవాల్సిందిగా సూచించారు. సాంకేతిక విద్యను అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు మారుతుండాలని పేర్కొన్నారు. పిల్లలను అందజేస్తున్న రాగిజావను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈఓట వెంట హెచ్‌ఎం అబ్దుల్ ఖాదర్ ఉన్నారు.


బీజేపీ ప్రధాన కార్యదర్శిగా శ్రీను

మనుబోలు: భారతీయ జనతా పార్టీ మనుబోలు మండల ప్రధాన కార్యదర్శిగా మనుబోలు గ్రామానికి చెందిన వలిపి శ్రీనివాసులు నియమితులయ్యారు. గురువారం స్థానిక పద్మావతి ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో నాయకులు శ్రీనివాసులును సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బోలా శ్రీనివాసులు, వాసిరెడ్డి రామిరెడ్డి, ఆరుముళ్ల మురళి, రాజశేఖర్, గోపిరెడ్డి, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లె రైతుకు మొండిచేయి



వేగూరులో సాగులో ఉన్న మల్లె తోట



మల్లె పూలను సాగు చేసే సన్నకారు రైతులు నిండా మునిగిపోతున్నారు. ప్రస్తుతం పండగలు, వివాహ, ఇతర శుభకార్యాలున్నా రైతులకు తగిన లాభాలు ఉండడం లేదు. దళారులు సిండికేట్ కావడంతో వారు చేసేది లేక వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

- సిండికేట్‌గా మారిన వ్యాపారులు
- రైతులకు ఆదాయం అంతంతమాత్రమే..
- సీజన్‌లోనూ గిట్టుబాటు లేని వైనం

కోవూరు: నియోజకవర్గంలోని వేగూరు, తలమంచి, యల్లాయపాళెం, బుచ్చిరెడ్డిపాళెం, రేబాల, దామరమడుగులో సుమారు 100 ఎకరాల్లో మల్లె పూలను సాగు చేస్తుంటారు. మల్లెపూల ధరలో సంభవించే హెచ్చుతగ్గుల కారణంగా సాగుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఒక్కో కూలికి రూ.300 చెల్లించాల్సి ఉండడంతో లాభాలు తగ్గుముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ రెండు మండలాల్లో సాగయ్యే మల్లెపూలను నెల్లూరులోని పూల మార్కెట్‌కు తరలించి విక్రయాలు చేయాలి. అయితే వారు తక్కువ ధరకు మల్లెపూలను కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు ఇలా..

మల్లె సాగుకు ఎకరా విస్తీర్ణంలో 1600 మొక్కలను పెంచవచ్చు. తొలుత గుంతలు తవ్వి ఒక్కో గుంతలో రెండేసి మొక్కలను నాటాలి. తర్వాత తగిన మోతాదులో ఎరువు వేయాలి. మొక్కలకు అంటుకట్టిన ఏడాదిన్నర తర్వాత మొగ్గలు వస్తాయి. ఇవి వచ్చే సమయంలో మందులను పిచికారీ చేయాలి. ఇందుకు ఎకరాకు రూ.60 వేలు వరకు ఖర్చు అవుతుంది. పూలు పూయడం మొదలైన తర్వాత పదేళ్ల పాటు దిగుబడి ఉంటుంది.

సబ్సిడీ ఇవ్వాలి

ప్రభుత్వం వరితో పాటు ఇతర పంటలకు ఎరువులు, పురుగు మందులను సబ్సిడీపై ఇస్తుంది. అదేవిధంగా మల్లె రైతులకు కూడా సబ్సిడీపై ఎరువులు, పురుగుల మందులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. గతంతో పోలిస్తే ఎరువులు, పురుగుల మందుల ధరలు రెట్టింపు అయ్యాయని, ఇలాంటి సమయంలో ప్రభుత్వమే ఆదుకోవాలని వారు వాపోతున్నారు.



మల్లెపూలను విక్రయిస్తున్న మహిళ

దళారుల దోపిడీ

అన్ని మార్కెట్లకు ఉన్నట్లే పూల మార్కెట్లోనూ దళారుల దోపిడీ తప్పడం లేదు. వీరు పల్లెల్లోని తోటల వద్దకు తమ సిబ్బందిని పంపించి అక్కడే తూకం వేసి పూలను కొనుగోలు చేస్తారు. ఆ సమయంలో రైతులకు ధర ఎంత అనేది చెప్పకుండా ఒక పుస్తకంలో ఎన్ని కేజీలు కొనుగోలు చేశారో మాత్రమే నమోదు చేస్తారు. నెలకు ఒక్కసారిగా మొత్తం డబ్బు చెల్లిస్తారు. సీజన్ మొదలైన తొలి మూడు మాసాల్లో మంచి ధర ఉన్నా, రైతులకు మాత్రం నామమాత్రపు ధర ఇస్తున్నారు. దళారులు మాత్రం సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలు నిర్ణయించి వినియోగదారులకు విక్రయిస్తూ లాభాలు దండుకుంటున్నారు. దళారీ వ్యవస్థను నియంత్రిస్తే పూల రైతులకు తగిన గిట్టుబాటు ధర దక్కుతుంది. ఆ దిశగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నెల్లూరు మార్కెట్‌లో గది ఇవ్వాలి



నెల్లూరు పూల మార్కెట్‌లో మాకు ఒక గదిని ఏర్పాటు చేయాలి. మేము పండించిన పూలను మేము అమ్ముకునే పరిస్థితి లేదు. దీనివల్ల దళారుల చేతిలో మోసపోతున్నాం. ఎంత మంది అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు.

– అమారి బాబు, మల్లె రైతు, వేగూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



కష్టించి పండించిన మల్లె సాగును దళారులు తన్నుకుపోతున్నారు. మా శ్రమ వృథా అవుతోంది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి. లేకుంటే రానున్న రోజుల్లో మల్లె సాగును వదిలేసే పరిస్థితులు వస్తాయి.

– నర్ర వెంకటేశ్వర్లు, మల్లె రైతు, సుబ్బారెడ్డిపురం

సహకారం అందిస్తాం

పూల సాగు రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం. జిల్లా అధికారులతో మాట్లాడి నెల్లూరు మార్కెట్‌లో రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు అవసరమైన వసతులు కల్పించేలా కృషి చేస్తాం.

– విశాల్, ఉద్యానశాఖ అధికారి, కోవూరు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆనంద్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెంలో జగనన్న కాలనీలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తి కావల్సి ఉందన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. మార్చి 25లోపు నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకే బిల్లులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ క్రమంలో స్థానికులు మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. వెంటనే స్పందించిన ఆయన సాధ్యమైనంత త్వరగా మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఐటీఐలో యువకులకు ఉచిత శిక్షణ

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక (ఐటీఐ) శిక్షణ సంస్థలో పీఎంకేవీవై (ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన) కింద యువకులకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ (టెన్త్ పాస్, మూడు నెలల కాలపరిమితి), జామ్, జెల్లీ, కెచప్ ప్రాసెసింగ్ టెక్నీషియన్ (8వ తరగతి పాస్, మూడు నెలల కాలపరిమితి)లో శిక్షణ ఇస్తామన్నారు. 15 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సున్న వారు పాల్గొనవచ్చన్నారు. బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 99484 20477 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత మీదే..

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారామ్

వెంకటాచలం: అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ఐసీడీఎస్ అధికారులపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారామ్ అన్నారు. మండలంలోని గొలగమూడి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన అధికారులతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌష్టికాహారం సరఫరాపై పిల్లలకు, గర్భిణులకు, బాలింతలతో మాట్లాడారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, బియ్యం, కోడిగుడ్లు, కందిపప్పు, బాలామృతంతోపాటు, ఇతర పదార్థాల నాణ్యత, కాల వ్యవధి తేదీలను ఎప్పటికప్పుడు గమనించాలని సిబ్బందికి తెలియజేశారు.



కోడిగుడ్లను పరిశీలిస్తున్న సీతారామ్

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ పద్మజ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: యువత క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ తన ప్రతిభతో ధ్యాన్‌చంద్ హాకీ క్రీడా చరిత్రలో సుస్థిర స్థానం సాధించారన్నారు. మెరుపు వేగంతో గోల్స్ చేయగల క్రీడాకారుడిగా ఆయన గుర్తింపు పొందారని కొనియాడారు. వివిధ ఒలింపిక్ గేమ్స్‌లో భారత్‌కు పతకాలు అందించిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కుందన్నారు. విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: ప్రతిభ చూపిన విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ, అధ్యాపకులు

- మనుబోలు: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ వేణుగోపాల్ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంతోపాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞను చేయించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో..

ఇందుకూరుపేట : జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను గురువారం మండలంలోని నరసాపురం జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్‌ఎం నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, కామేశ్వరి, కృష్ణారెడ్డి సంయుక్తంగా సొంత నగదును వెచ్చించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర విద్యాసంస్థల ప్రాంగణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ హాకీ క్రీడాకారుడు 'మేజర్ ధ్యాన్‌చంద్' చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ పి.రవికుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మనుబోలు: పతకాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు



కొడవలూరు : మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

తెలుగు భాష విశిష్టతను తెలుసుకోవాలి



వెంకటాచలం: మాట్లాడుతున్న వీసీ విజయభాస్కరరావు



వెంకటాచలం: అధ్యయన కేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న వారు

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: తెలుగు భాషను విద్యార్థులందరూ తెలుసుకోవాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు సూచించారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాష వైభవంపై జాతీయ సదస్సు గురువారం మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో జరిగింది. ఈ సందర్భంగా గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ తెలుగు భాషకున్న ప్రాధాన్యతను అందరూ తెలుసుకోవాలన్నారు. తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు, పుస్తక పఠనం ఆవశ్యకత గురించి వివరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎం.త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన కేంద్రంలో..

మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడారు. పలువురు కవులు తెలుగు భాష గురించి వివరించారు.

- ముత్తుకూరు: మాతృభాష అయిన తెలుగును ఎవరూ మరిచిపోవద్దని ఎంఈఓలు మధుసూదన, హేమసుందర్ సూచించారు. బలిజపాళెం పాఠశాలలో గురువారం జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో వారు పాల్గొని, ప్రసంగించారు. అంతకు ముందు జరిగిన తెలుగు పద్యాల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు కృష్ణకుమార్, పర్వీన్, సీఆర్పీ ప్రసన్న, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- తోటపల్లిగూడూరు: మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు తెలుగు పద్యాలు, గేయాలపై పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. హెచ్‌ఎం షేక్ అహ్మద్‌బాషా తెలుగు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రాచీన కవులు, ఆధునిక కవుల చిత్రాలను విద్యార్థులకు ప్రదర్శించి అవగాహన కల్పించారు. అలాగే తెలుగు సామెతలు, కథలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. టీచర్లు గిరిజకుమారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కోవూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీ ప్రసూన, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



ముత్తుకూరు: విద్యార్థినికి బహుమతి అందజేత



సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో..



కోవూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ఏజీ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

పొదలకూరు: ఏజీ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్, స్పాట్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ గుంటూరులో జరుగుతుందని పొదలకూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.ప్రసన్నరాజేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థులు (స్పోర్ట్స్, గేమ్స్, ఎన్‌సీసీ, పీహెచ్ అండ్ క్యాప్)కు గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఏపీజీసీ సెమినార్ హాల్లో జరుగుతుందన్నారు. ఇదివరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 30వ తేదీ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులకు సెప్టెంబర్ 5వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ గుంటూరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కృష్ణా ఆడిటోరియంలో ఉంటుందన్నారు. ఇందులో ఎలాంటి రిజర్వేషన్లు వర్తించవని, టెన్త్‌లో సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. మొదటి వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, రూ.800 స్పాట్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిందిగా సూచించారు.

వాటర్ ప్లాంట్‌పై వైఎస్సార్ ఫొటో తొలగింపు

మనుబోలు: మండలంలోని అక్కంపేట గ్రామంలో రాజన్న జలధార పేరుతో దాత నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ బోర్డుపై వైఎస్సార్ ఫోటోను గురువారం అధికారులు తొలగించారు. నెలరోజుల క్రితం అధికార పార్టీ కార్యకర్తలు ప్లాంట్‌పై ఉన్న వైఎస్సార్ ఫొటోను తొలగించి ఎన్టీఆర్ ఫొటో పెట్టడంతో వివాదం చెలరేగింది. పంచాయతీ తీర్మానం ప్రకారం బుధవారం ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించారు. ఇక్కడ వైఎస్సార్ ఫొటో ఉన్న బోర్డు పెట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడతాయంటూ సీఐ రాంబాబు సూచనలతో ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి రాజేశ్వరి గురువారం ఆ బోర్డును తొలగింపజేసి వేరే దానిని ఏర్పాటు చేయించారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వాటర్ ప్లాంట్ బోర్డును మారుస్తున్న దృశ్యం

మహారాజశ్రీ కోవూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పి.నెం.5/2024

పఠాన్ ఫిరోజ్‌ఖాన్ – పిటీషనర్

Vs

1. షేక్ వహిద
2. పందిటి శ్రీనయ్య
3. షేక్ ఖలీల్ – రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరు తనని ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టు వారు **ఐ.పి.నెం.5/2024** ను దాఖలు చేసియున్నందున సదరు **ఐ.పి.** పై ఎవ్వరికైనను ఆక్షేపణలు ఉన్నయెడల **తే. 4.9.2024 దిన ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెనని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు : **ఆత్మకూరు చెన్నయ్య,**
పిటిషనర్ తరపు అడ్వకేట్, కోవూరు.